విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

నియోజకవర్గంలో తగ్గిన ఓటర్లు

విశాలాంధ్ర అవనిగడ్డ : నియోజకవర్గంలో మొత్తం 6 మండలాల్లో గతం కంటే భారీగా ఓటర్ల సంఖ్య తగ్గింది. నియోజకవర్గంలో ఘంటశాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండ లాలు ఉన్నాయి. ఘంటశాల మండలంలో పురుషులు 15,948 మంది, స్త్రీలు 16,648 ట్రాన్స్ జెండర్‌లు ఇరువురు మొత్తం 32,598 మంది ఓటర్లు ఉండగా, చల్లపల్లిలో పురు షులు 20,139 మంది, స్త్రీలు 21,301, ట్రాన్స్ జెండర్ లు 11 మంది, మొత్తం 41,451 మంది, మోపిదేవిలో పురుషులు 13,944 మంది, స్త్రీలు 14,186, మొత్తం 28,130 మంది, అవనిగడ్డ లో పురుషులు 15,138 మంది, స్త్రీలు 15,910మంది, ఇరువురు ట్రాన్స్ జెండర్ లు, మొత్తం 31,050 మంది, కోడూరులో పురుషులు 17,607 మంది, స్త్రీలు 17,578, ట్రాన్స్ జెండర్ లు 1, మొత్తం 35,186 మంది, నాగాయలంకలో పురుషులు 19,297 మంది, స్త్రీలు 19,105, ట్రాన్స్ జెండర్ లు 4 మంది, మొత్తం 38,409 మంది, 6 మండలాలు కలిపి 2,06,824 మంది ఓటర్లు కాగా వీరిలో 1,02,073 మంది పురుషులు, 1,04,731 మంది స్త్రీలు, 20 మంది ట్రాన్స్ జెండర్లు కాగా నియోజకవర్గంలో 2,658 మంది స్త్రీ ఓటర్లు అధికంగా ఉన్నారు. గతం కంటే భారీగా ఓటర్లు తగ్గారు.

భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలి

- హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి సూర్యనారాయణ

విశాలాంధ్ర - గుడివాడ : వర్షపు నీటిని ఓడిసిపెట్టుకుని భూగర్భ జలాలను పెంచేందుకు ఈ నిర్మాణాలు ఎంతగానో తోడ్పడతాయని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం గుడివాడ ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో మల్లయ్యపాలెం గ్రామ సచివాలయం-2 వద్ద రూ.56 వేలతో నిర్మించిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను, రూ.40 వేల అంచనా వ్యయంతో దొండపాడులో నిర్మిస్తున్న కమ్యూనిటీ సోక్ పిట్ పనులను ఆయన ప్రారంభించారు. జగనన్న హౌసింగ్ గృహ నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామి ఈ.సి రామకృష్ణ, టి.ఎ రమేష్, హౌసింగ్ డిఇఇ రామోజీ నాయక్, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

2024 సాధారణ ఎన్నికలకు సన్నద్ధం గా ఉండండి

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

విశాలాంధ్ర-మచిలీపట్నం: 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకే మీనా శుక్రవారం అమరావతి సచివా లయం నుండి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిం చారు. వివిధ జిల్లాల్లో 2014, 2019 సాధారణ ఎన్నికల నిర్వహణ గురించిన సమాచారంతో పాటు 2024 సాధారణ ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్ల గురించి సమీక్షించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జిల్లాలో గత ఎన్నికల సమాచారంతోపాటు 2024 సాధారణ ఎన్నికల సన్నద్ధత గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు.

జిల్లాలో ఒక పార్లమెంటు నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. సాధారణ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో మాన్ పవర్ సంబం ధించి సెక్టార్ అధికారులు 159, మైక్రో అబ్జర్వర్లు 1940, ప్రిసైడింగ్ అధికారులు 1940, పోలింగ్ ఆఫీసర్స్ 7757, బి ఎల్ ఓ లు 1763 మంది అవసరం కాగా, ఈ ప్రకారం ఏర్పాట్లు చేయుటకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రంలో ఎన్నికల అధికారులు సిబ్బందికి శిక్షణ నిర్వహణకు శిక్షణ కేంద్రంతో పాటు స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో గల 7 అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో ఎన్నికల మెటీరియల్ డిస్పాచ్ కేంద్రం, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2019 సాధారణ ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 1137 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలు ప్రధాన ఎన్నికల అధికారికి తెలియజేశారు. జిల్లా ఎస్పీ పి జాషువా సెక్యూరిటీ ప్లాన్, వినియోగించిన పోలీస్ ఫోర్స్ వివరాలు తెలియజేశారు. గత ఎన్నికలలో మద్యం, నగదు సీజ్ చేసిన సమాచారం తెలియజేశారు. లా అండ్ ఆర్డర్, బైండోవర్, మద్యం, నగదు అక్రమ రవాణా నివారణకు చెక్‌పోస్టుల ఏర్పాటు గురించి వీడియో కాన్ఫరెన్స్లో వివరిం చారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం కింద నవంబర్ 4, 5 తేదీల్లో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అర్హత కలిగిన వారందరూ ఓటరుగా నమోదు కావాలని, ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏ ఎస్ పి శ్రీహరిబాబు, డిఆర్ఓ పెద్ది రోజా వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పలువురు అధికారులు

మచిలీపట్నం: శుక్రవారం సాయంత్రం మచిలీపట్నంలోని కలెక్టర్ చాంబర్లో నూతనంగా నియమితులైన అధికారులు కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె. రాములు నాయక్, గుడివాడ డి ఎల్ డి ఓ కె.వెంకట సుబ్బా రావు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుని కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు.

రైతులకు వెనిగండ్ల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - గుడివాడ : నందివాడ మండలంలో చినలింగాల రైతులకు సాగ నీరు ఎత్తిపోతల నిమిత్తం రెండు మోటర్లులను గతంలో వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము సమకూ ర్చారని రైతులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని వెనిగండ్ల రాము వ్యక్తిగత కార్యాలయంలో వెనిగండ్లను కలిసి రైతులు తమ సమస్యలను వివరించారు. వెంటనే స్పందించిన రాము సాగునీరు ఎత్తిపోతల మెటీరియల్ సమకూర్చటానికి ఫౌండేషన్ ద్వారా తన వంతు సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంపట్ల వైసిపి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. ప్రభుత్వం నుండి సాయం చేస్తుందేమో అని ఎదురుచూపులు చూసి, ఏ సహాయం అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రాజెక్టులు లేని రాతియుగం నాటి సమస్యలను తిరిగి రైతాంగం ఎదుర్కొంటున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేటి రోజుల్లో ప్రభుత్వ చేతకాని తనం వల్లనే ప్రాజెక్టుల్లోని నీరు రైతులకు అందడం లేదన్నారు. ఇసుక దోపిడీపై ఉన్న శ్రద్ధ, ప్రాజెక్టులను నిర్వహించడంలో ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. . చంద్రబాబుకు పేరు వస్తుందనే పట్టిసీమ నుండి నీరు విడుదల చేయడం లేదని, అన్నం పెట్టే రైతన్నకు సాయం చేయటం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

హ్యాపీ దీపావళి... సైకో దిగిపోవాలి.

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వినూత్నరీతిలో తమ నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు రూపొందించిన హ్యాపీ దీపావళి.. సైకో దిగిపోవాలి స్టిక్కర్లను శుక్రవారం విడుదల చేశారు. స్థానిక ఏటీఎం సెంటరులో స్టిక్కర్లు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, పార్టీనేతలు జల్లూరి ప్రసాద్, షేక్ నబీఘోరి, వాసిరెడ్డి రాకేష్, షేక్ సిలార్, కుంభా కృష్ణ, పఠాన్ అయూబ్, కె. మురళి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు యూనిఫాం అందజేసిన పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 40 మంది పోలీస్ సిబ్బందికి పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీష్ కుమార్ యూనిఫామ్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అల్లు నవీన్ నరసింహమూర్తి మాట్లాడుతూ సతీష్ కుమార్ పోలీస్ శాఖ కోసం లక్షలాది రూపాయలు విరాళాలుగా అందించటమే కాకుండా హనుమాన్ జంక్షన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మించి ఇచ్చారన్నారు. సీసీ కెమెరా వ్యవస్థ పూర్తిస్థాయిలో అందించిన ఘనత ఆయదేనని ప్రశంసించారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ జంక్షన్ సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన అందించిన ఆర్థిక సహాయం చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం ప్రజల క్షేమం కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న పోలీసు సిబ్బందికి ఎంత చేసినా తక్కువేనని అన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటిలో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - బంటుమిల్లి : శ్రీ సత్యసాయి సేవ సమితి వారు కృష్ణాజిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటి లో స్థానిక కొమ్మారెడ్డి హైస్కులు విద్యార్థులు జిల్లాస్థాయి బహుమతులు సాధించ రాని పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ శుక్రవారం పాత్రికేయు లకు తెలిపారు . ఈ నెల 26 వ తేదిన శ్రీ సత్యసాయి సేవ సమితి వారు కొమ్మారెడ్డి హైస్కూల్ వారికి నిర్వహించిన ""ఆచార్యదేవోభవ "" అనే అంశంపై వ్యాసరచన పోటీలను 8,9,10 వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల ,తెలుగు మాధ్యమాలలో నిర్వహించటం జరిగిందన్నారు.ఈ పోటిలలో పాల్గొన్న ఓ మహేశ్వరీ (10 వ) ప్రథమ స్థానం,వి ఎస్ ఎల్ శ్రీవిద్య (10వ) ద్వితియ స్థానాన్ని సాదించారన్నారు. అలాగే 9 వ తరగతి చదువుతున్న పి లక్ష్మి సక్కుబాయి, ఎస్ సంజనా, ఎ.హానిశ్రీ లకు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారని కిషోర్ తెలిపారు. ఇంతటి ఘనవిజయన్ని సొంతం చేసుకున్న విద్యార్థులను కొమ్మారెడ్డి కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని ఉపాద్యాయులు ,విద్యార్ధిని విద్యార్థులు అబినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి నడక పోటీలకు ఎంపికైన మొవ్వ విద్యార్థిని

విశాలాంధ్ర- కూచిపూడి : మొవ్వ శ్రీ మండవకనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి (ఏ. సెక్షన్) విద్యార్థిని బండారు యామిని అథ్లెటిక్ అంశమైన మూడు కిలోమీటర్ల నడకలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సబినేని సాంబ శివరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో రెండో స్థానంలో నిలిచిన ఆమెను ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు అప్పిగట్ల రామారావు, మండలి మనోహరి అభినందించారు.

పల్లోటి స్కూల్లో వార్షిక క్రీడల ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-పెడన: పట్టణం పల్లోటి స్కూల్లో వార్షిక క్రీడలను మచిలీపట్నం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి యు వి సుబ్బారావు, స్కూల్ కరస్పాండెంట్ జోజి రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉప విద్యాశాఖ గారు యు.వి సుబ్బారావు ముఖ్య అతిథిగా విచ్చేసి వార్షిక క్రీడాజ్యోతిని వెలిగించి పాఠశాలలో ఏర్పరచబడిన నాలుగు గ్రూపుల మధ్య వివిధ క్రీడా పోటీలను ప్రారంభించారు. నూతనంగా ఏర్పరచబడిన వాలీబాల్ గేమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. అదేవిధంగా స్కూల్ స్థాయిలో ఆటల పోటీల ప్రారంభోత్సవాన్ని ఆసియన్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ తరహాలో ప్రారంభించడం బహు ఆనందంగా ఉందని తెలిపారు. స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజి రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకి ఈ క్రీడలు చక్కటి మైలురాయ అని తెలిపారు . ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు, స్కూల్ డీన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాఫల్య సామర్థ్య సర్వే పరీక్ష



విశాలాంధ్ర-పమిడిముక్కల: రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వ్యవస్థ ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యలు పై లోపాలు ఉపాధ్యాయుల వృత్తి పరమైన అంశాలు పై స్టేట్ ఎడ్యుకేషన్ ఎచివ్ మెంట్ సర్వే (ఎస్.ఇ.ఎ.ఎస్) పరీక్షల నిర్వహణ ను మండల విద్యాశాఖాధికారి-2 బి.శ్రీనివాస్ పరిశీలించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ఫలితాలు ద్వారా అభ్యాసన అంతరాలను గుర్తించడంతో పాటు అమలవుతున్న విద్యా విధానం, భోధనా అభ్యాసన లోపాలు గుర్తించటం అవసరమైన చర్యలు చేపట్టనున్నారని తెలిపారు. మండలం మొత్తం లో 634 మంది 3,6,9, తరగతుల విద్యార్థులు సర్వే పరీక్ష వ్రాశారని తాడంకి, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, అగినపర్రు, మేడూరు, ఐనపూరు, జీసస్ ఉన్నత పాఠశాల, అలినఖీ పాలెం, మర్రివాడ ప్రాథమికోన్నత పాఠశాలలు కపిలేశ్వరపురం (తూర్పు) యం.కె. పాఠశాల, మంటాడ(మెయిన్) ఐనపూరు, జీసస్ ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థులకు అభ్యాస లక్షణాలు పై పరీక్షలను నిర్వహించారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్షా కేంద్ర ఏర్పాట్లు పరివేక్షించారని,పరీక్ష పర్యవేక్షులుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కళాశాల విద్యార్థులను నియమించారని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు.

ఏయంసి చైర్మన్ గా గాడెల్లి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర మచిలీపట్నం : మచిలీపట్నం మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గా ఈ నెల 8న గాడెల్లి డేవిడ్ శామ్యూల్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మణరావు పురం లోని ఫెయిత్ టెంపుల్ చర్చ్ ఆవరణలో పాత్రికేయులు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డేవిడ్ శామ్యూల్ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని చొరవతో తనకు ఈ పదవి దక్కిందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించి వారికి అండగా ఉంటానని అన్నారు. దేవుని యందు భయ భక్తులు కలిగి ఉన్నందునే ఈ పదవి లభించిందన్నారు. సేవకులు జక్రియాస్, గుమ్మడి మానిక్యారావు, రాజు, ఏపి క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల జానీ, వైసిపి నాయకులు నోబుల్ థామస్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఈ పదవి దక్కడం ముదావహం అన్నారు. అనంతరం పాస్టర్ లు అందరూ డేవిడ్ శామ్యూల్ కు ప్రార్ధన లు చేశారు.

వార్డు నెంబరగా జాస్తి శ్రీధర్ గెలుపు

విశాలాంధ్ర-గన్నవరం : మండలంలోని కేసరపల్లి గ్రామపంచాయతీ 1వ వార్డు సభ్యుడిగా జాస్తి శ్రీధర్ బాబు ఏడు ఓట్ల మెజారిటీతో రీ కౌంటింగ్ లో విజయం సాధించారు. కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రీ కౌంటింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 2.30 గంటల వరకు రీ కౌంటింగ్ పక్రీయ కొనసాగింది. 2021 ఫిబ్రవరి 21న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కేసరపల్లి 1వ వార్డులో ముల్పూరి మాధవన్ రెండు ఓట్లు అధిక్యతతో గెలుపొందారు. అయితే కౌంటింగ్ సక్రమంగా నిర్వహించకుండా రిటర్నింగ్ అధికారి మాధవన్ గెలిచినట్లుగా ఏకపక్షంగా ప్రకటించారు. దీంతో జాస్తి శ్రీధర్ బాబు గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. మళ్ళీ సజావుగా కౌంటింగ్ నిర్వహించి పలితాలు వెల్లడించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా మాధవన్ హై కోర్టులో వేసిన పిటిషన్ కూడా కొట్టి వేయడంతో రీ కౌంటింగ్ అనివార్యమైంది. కోర్టు ఆదేశాలు మేరకు శుక్రవారం గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి పరిశీలనలో ఆర్వో తహశీల్దార్ నరసింహారావు రీ కౌంటింగ్ నిర్వహించారు. మొత్తం పొలైన ఓట్లులో జాస్తి శ్రీధర్ బాబుకు 213, ముల్పూరి మాధవన్ కు 206, నేరుసు శివశంకర్ కు 3, చెల్లని ఓట్లు 18 గా గుర్తించారు. జాస్తి శ్రీధర్ బాబు ఏడు ఓట్లతో గెలుపొందినట్లుగా ప్రకటించారు. ఈ మేరకు జాస్తి శ్రీధర్ బాబుకు ధృవీకరణ పత్రం అర్వో అందజేశారు. రీ కౌంటింగ్ లో డీఎల్పీవో సంపత్ కుమారి, ఎంపీడీవో సత్యకుమార్. ఈఓపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద గొడవలు దిగిన మధవన్, అతని సోదరుడు ఎంవీఎల్, ప్రసాద్ ను ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. రీ కౌంటింగ్ ద్వారా నిజం గెలిచిందని మాజీ ఎంపీసీ చైర్మన్ పొట్లూరి బసవరావు తెలిపారు. అనంతరం కేసరపల్లిలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక హారతి ఇచ్చి పంచాయతీ కార్యాలయంలోకి స్వాగతించారు. నిజం గెలిచిందంటూ గ్రామంలో ప్రజలు అడుగడుగున నీరాజనాలు పలికారు. జె వి బి కుమార్ ,జేవిడి ప్రసాద్, మూల్పూరి ధన కోటేశ్వరావు, జాస్తి వీరబాబు, మూల్పూరి హరిచంద్ర ప్రసాద్, వార్డు సభ్యులు శ్రీధర్ బాబును అభినందించారు.

స్కూల్ గేమ్స్ పోటీలలో ఎస్.వి.ఎల్ విద్యార్థులు

విశాలాంధ్ర అవనిగడ్డ : స్కూల్ గేమ్స్ పెడరేషన్ అండర్ 19 పోటీ లలో ఎస్.వి.ఎల్ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ఎస్.వి.ఎల్ విద్యా సంస్థల కరస్పాం డెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. జూనియర్ కాలేజీ విద్యార్థులు ఎన్ సందిని , టి శ్రావణి, వి ప్రవీణ్ కుమార్, ఎస్.కె భాషా, కె సాంబశివరావు, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యారని, అలాగే అండర్ 17 విభాగంలో ఎం లలితాదేవి ఫుడ్‌బాల్ పోటీకి, రషిత సాఫ్ట్ బాల్ పోటీకి ఎంపిక అయ్యినట్లు ఉమామహేశ్వరరావు చెప్పారు. ఈ విద్యార్థులు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో 04.11.2023 వ తేది నుండి 06.11.2023 వ తేది వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనబోతున్నట్లు చెప్పారు. కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎన్ వి నాగేశ్వరరావు, అధ్యపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు అభినందనలు తెలిపారు.

25 వ తేదిన అరుణాచలంకు ప్రత్యేక సర్వీసు

విశాలాంధ్ర అవనిగడ్డ : ప్రతి నెల పౌర్ణమికి భక్తుల సౌకర్యార్థం అరుణాచల గిరి ప్రదక్షణకు అవనిగడ్డ ఆర్.టి.సి డిపో నుండి ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతురావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కార్తీక పౌర్ణమికి ఈ నెల 25 వ తేది శనివారం సాయంత్రం 5 గంటలకు అవనిగడ్డ నుండి బస్సు బయలుదేరి రేపల్లె, కానీపాకం, అర్ధవీడు, సిరిపురం, అరుణాచలం వెళ్ళి 26 వ తేది ఆదివారం పౌర్ణమి రోజు దైవ దర్శనం అరుణాచలగిరి ప్రదక్షణ జ్యోతి దర్శనం చేసుకుని కంచి, విష్ణుకంచి, కామాక్షమ్మ గుడి, బంగారుబల్లి, తిరుతుని, కాళహస్తి దర్శించుకుని నవంబర్ 28 వ తేది మంగళవారం అవనిగడ్డ చేరుకుంటుందన్నారు. ఈ సెషల్ సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని ముందు సీట్లు కావాలనుకున్న వారు ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని టికెట్లను ఆన్‌లైన్ నందు కానీ, ఎటిబి ఏజెంట్ల వద్ద కానీ రిజర్వేషన్ కౌంటర్ వద్ద కానీ పొందవచ్చుని, రానూపోనూ మరిన్ని వివరాలకు 9959225466 గానీ 7036335079 గానీ సంప్రదించాలన్నారు.

మన కోసం మనం ట్రస్టు విరాళం

విశాలాంధ్ర-చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీ కరణ పనులు చేపడుతున్న - మన కోసం మనం ట్రస్టుకు మాధవి శిల్క్ షోరూమ్ అధినేత వరదా హరిగోపాల్ రూ.10వేల విరాళాన్ని అందచేశారు. హరిగోపాల్ తండ్రి, మాజీ సర్పంచ్ వరదా వెంకట రామారావు మూడవ వర్ధంతి సందర్భంగా ఈ విరాళాన్ని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీఆర్కే ప్రసాద్కు అందించారు. స్వచ్ఛ కార్యకర్తల తరపున డీఆర్కే దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కారుమూరి, జోగి

విశాలాంధ్ర అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్ద పీఠ వేస్తున్నారని మంత్రులు జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావులు అన్నారు. గురువారం అవనిగడ్డలోని సామాజిక సాధికార బస్సుయాత్ర సందర్భంగా మంత్రులు ఎం.పి లు మోపిదేవి వెంకట రమణ, ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, నందిగామ సురేష్‌లు కలిసి మంత్రులతో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రూ. 3.20 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మంత్రులు ఎం.పి లు డయాలసిస్ పేషెంట్‌లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డ వచ్చిన సందర్భంగా ఇచ్చిన ప్రధాన హామీలలో డయాలసిస్ కేంద్రాన్ని నెరవేర్చారన్నారు. నిరుపేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇచ్చే ముఖ్యమంత్రి అడిగిన వెంటనే డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేశారన్నారు. ఈ కేంద్రం నియోజకవర్గంలోని కిడ్నీ బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతుందని గతంలో ఏ ముఖ్యమంత్రి ఇంతగా పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టలేదన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మంత్రి జోగి చెప్పారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక, జిల్లా పార్టీ అధ్యక్షులు పెర్ని వెంకట రామయ్య (నాని) పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్, ఎం.ఎల్.సి లు మర్రి రాజశేఖర్, పోతుల సునీత, జంగ కృష్ణమూర్తి లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు పాల్గోన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి ఎమ్మెల్యే రక్షణ నిధి

విశాలాంధ్ర - ఎ కొండూరు: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్లో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో అన్ని పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారని అన్నారు కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారానికి ఏ కొండూరు పీహెచ్సీ వద్ద డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కిడ్నీ రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నామని అన్నారు తద్వారా సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే ఏ ఎస్ రవికాంత్ ఎ కొండూరు సర్పంచ్ వేంపాటి రజిని మాధవరం సర్పంచ్ కుక్కల సీతమ్మ ఎంపీటీసీ కోట పుల్లారావు పిఎసిఎస్ అధ్యక్షులు వెంకటరెడ్డి గుర్రాల వెంకట్రావు మోర్ల లక్ష్మి సాంబశివరావు తేళ్లూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మసాలా మిక్స్‌ను లాంచ్ చేసిన ఐటీసీ ఆశీర్వాద్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రాంతాలలో సుగంధ ద్రవ్యాల విభాగంలో ప్రముఖ బ్రాండ్‌లలో ఒకటైన ఆశీర్వాద్ స్పైసెస్, తన తాజా సమర్పణగా ఆశీర్వాద్ మసాలా కారం అందిస్తుంది. ప్రతి వంటగదిలో రుచి, సౌలభ్యాలను పునర్నిర్వచించే విధంగా బహు ఉపయోగాల మసాలా మిక్స్‌ను పరిచయం చేస్తోంది. వారసత్వం, ఆధునికత మధ్య అంతరాన్ని తగ్గించే సంప్ర దాయ సుగంధ ద్రవ్యాల అసాధారణమైన కలయికగా ఈ సమున్నతమైన ఆంధ్రా మసాలా మిక్స్ రూపొందింది. మసాలా కారం ఇంట్లో తయారు చేసిన ఆహారం రుచిని కాపాడుతూనే, భోజనం రుచిని పెంచుతుందని హామీ అందిస్తుంది. ఆంధ్రా వంటల వారసత్వం, తెలుగువారి గృహాలలో 'కూర కారం' సృష్టించే కాలాతీత సంప్రదాయం నుండి స్ఫూర్తి పొందుతూ ఐటీసీ ఆశీర్వాద్ స్పైసెస్ నేటి వంటశాలల డిమాండ్‌లకు అనుగుణంగా మసాలా కారానికి కొత్త శోభను అందిస్తున్నాయని ఐటీసీ లిమిటెడ్ స్పైసెస్ బిజినెస్ హెడ్ పీయూష్ మిశ్రా చెప్పారు. స్పైసెస్‌లో, పాకశాస్త్ర వారసత్వాన్ని సంరక్షించడం రుచులకు మించి విస్తరించిన అంశమని తాము గుర్తించామన్నారు. ఇది సంప్రదాయం, నిమగ్నత వంటగదిలో సౌలభ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. కరివేపాకులను కలిగి ఉన్న సాంప్రదాయ సుగంధ ద్రవ్యాల ప్రత్యేకమైన మిశ్రమం, అలాగే ఈ ప్రాంతంలోని రైతుల నుండి నాణ్యత ప్రకారం సేకరించబడిందని తెలిపారు.

క్యాట్‌లో చైతన్య విద్యార్థులు విజయభేరి



విశాలాంధ్ర-విజయవాడ : శ్రీచైతన్య విద్యాసంస్థలు ప్రతిష్టా త్మకంగా ప్రతి సంవత్సరం నిర్వ హించే క్యాట్ పరీక్షా ఫలితాల్లో లెవల్-1లో స్థానిక ఏలూరు రోడ్డు మారుతీనగర్ బ్రాంచ్ విద్యార్థులు 60 మంది విజయభేరి మ్రోగించారు. క్యాట్ లెవల్-1లో మ్యాట్‌లో 18, ప్యాట్‌లో 20, చాట్‌లో 22 మంది విద్యార్థులు క్యాట్ లెవల్-2కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల ఈజీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీచైతన్య కరిక్యులమ్ విధానంలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగల్గుతున్నారని చెప్పారు. ఉపాధ్యయుల ఉత్తమ శిక్షణ తోడ్పడుతుందారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖరబాబు, ప్రిన్సిపల్ సుజన, డీన్ మీనాచారి, సి.ఇన్‌చార్జ్ పవన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించేందుకు గ్రామ సభలు

విశాలాంధ్ర- పెదపారుపూడి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు 2024 -25 సంవత్సరమునకు గాను మండలంలో గ్రామాల వారీగా గుర్తించేందుకు గ్రామ సభలు గురువారం నుండి ప్రారంభించినట్లు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో నత్త స్ఫూర్తి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా స్ఫూర్తి మాట్లాడుతూ ఎంపీడీవో టీ సీతా మహాలక్ష్మి ఆదేశాల మేరకు భూషణగుళ్ళ సచివాలయంలో జరిగిన గ్రామసభలో 72 పనులు గుర్తించి ఆమోదింప చేసినట్లు, అలాగే శుక్రవారం చినపారుపూడి సచివాలయంలో జరిగిన గ్రామ సభలో 65 పనులను గుర్తించి ఆమోదించినట్లు ఏపీవో తెలిపారు.

రావి, వెనిగండ్ల పరామర్శలు

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఇందిరాసి శ్రీనివాసరావు (లీడర్ శ్రీను) అనారోగ్య కారణంగా మృతి చెందగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావి వెంకటేశ్వరరావు, వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత, టిడిపి నాయకులు వెనిగండ్ల రాములు వేరువేరుగా భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ప్రజాధరణ చూసి వైసీపీ వెన్నులో వణుకు

విశాలాంధ్ర - గుడివాడ : రోజురోజుకీ తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి భయపడుతున్న జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టి తమ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలకోట్ల రూపాయలను అక్రమంగా సంపాదించి జైలుకెళ్ళి బెయిల్ పై బయట తిరుగుతున్న సైకో జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. టిడిపి పార్టీలో ఉన్న ముఖ్య నాయకులపై కూడా అక్రమ కేసులు పెట్టి బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. స్కిల్ స్కాం అంటూ చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టిన ఈ ప్రభుత్వం కనీసం ఆరోపణ నిజం అని నిరూపించలేకపోయారని ఎద్దేవ చేశారు. ప్రభుత్వ అధికారులు తమ విధులు మరిచి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అంటూ రావి హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ్ర - గుడివాడ : గుడ్లవల్లేరు మండలం పురిటిపాడు గ్రామంలో భవిష్యత్తు గ్యారెంటీ - ఇది బాబు షూరిటీ కార్యక్రమాన్ని శుక్రవారం నియోజ కవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ అడుసుమిల్లి రామ్మోహన్‌రావు, యూనిట్ ఇంచార్జ్ కాగిత నరేంద్ర, బూత్ ఇంచార్జ్ బొర్రా ప్రసాద్, పొలగానీ వనబాబు, బొర్రా శ్రీను, సాంబశివరావు, బొర్రా మధు, శాయన పుష్పవతి, బెల్లంకొండ ఏడుకొండలు, పామర్తి సత్తిబాబు, శాయన ప్రసాద్, ఈడే మోహన్ తదితరులు పాల్గొన్నారు..

SESHADRI RAO
GUDLAVALLERU ENGINEERING COLLEGE
(An Autonomous Institute with Permanent Affiliation to JNTUK, Kakinada)
Seshadri Rao Knowledge Village, GUDLAVALLERU - 521 356, Krishna District, A.P.
Ph: 08674-273737/273888, Website: www.gecgudlavalleru.ac.in
SPOT ADMISSIONS
M.Tech: SE / PEED / MD / VLSID(ES) / CSE(AIML)
Spot admission to the vacant seats in 1st M.Tech after internal sliding, will be conducted on 06-11-2023 at 10:00 AM as per guidelines of the Convener, APPGECET 2023. Interested students shall appear for selection and admission along with all original certificates, M.Tech Tuition Fee of Rs.55,000/-. For details, visit www.gecgudlavalleru.ac.in and contact college office 9848779121.
SRGEC/Advt/2023, dt.04-11-2023 Secretary & Correspondent

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా ఈ నెల 4, 5, డిసెంబర్ 3, 4 తేదీల్లో కొత్తగా ఓటు హక్కు పొందడం, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు సరిచేసేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.డిల్లీరావు తెలిపారు. ఈ శిబిరాలు జరిగే తేదీల్లో ఉదయం 10 గం. నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ స్టేషన్లలో బీఎల్వోలు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. కొత్తగా ఓటు నమోదుతో పాటు అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు సరి చేయడం, చనిపోయిన ఓటరు జాబితా నుంచి తొలగించడం, ఓటరు కార్డులో తప్పుల సవరణ తదితర సేవల కోసం శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 26లోపు వాటిని పరిష్కరించి, 2024, జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు.

7న ఏపీ మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా మహాసభ

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా మహాసభ ఈ నెల 7వ తేదీ జరుగుతుందని మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పంచదార్ల దుర్గాంబ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఈ మహాసభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. మహిళా సమాఖ్య జిల్లా నాయకులందరూ తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

సరైన ప్రణాళికతో ఎన్నికలకు సన్నద్ధత

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రానున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా సరైన ప్రణాళికతో ఎన్నికలకు సన్నద్ధత అవుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి సీఈవో ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్, ఎస్పీలు, రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక రూపొందించాల్సిన అంశాలను వివరించారు. అవసరమైన మానవ వనరులు, అందుబాటులో ఉన్న మానవ వనరులు గత ఎన్నికల సందర్భంగా మోహరించిన పోలీసు బలగాలు, వచ్చే ఎన్నికలకు అవసర మయ్యే బలగాలు, భద్రతా సిబ్బంది, ఎన్నికల సిబ్బందికి అవసరమయ్యే వాహనాలు, ఇతర సౌకర్యాలు, డిస్పాచ్ సెంటర్, రిసీట్ సెంటర్, ట్రైనింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ తదితర భద్రతా ప్రణాళికను వివరించారు. గత ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన నియోజక వర్గాల వారీగా నమోదైన ఎఫ్ఐఆర్లు, కేసుల ప్రస్తుత పరిస్థితి వివరించారు. ఈ డిసెంబర్ తొలి వారానికి ప్రొవిజనల్ ఎన్నికల నిర్వహణ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం, డబ్బు రవాణా తదితరాల అడ్డుకట్టకు తీసుకునే చర్యలు, చెక్ పోస్టులకు సంబంధించిన అంశాలను వివరించారు. ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన జిల్లా స్థాయి, నియోజక వర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లను కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలు, సమస్యాత్మక ప్రాంతాలు, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల మ్యాపింగ్‌ను సీపీ కాంతిరాణా టాటా వివరించారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్‌వో నాగేశ్వరరావు, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎంసెట్ మూడవ విడత కౌన్సెలింగ్ అందరికీ నిర్వహించాలి

విశాలాంధ్ర-విజయవాడ : ఎంసెట్ మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన అతిథి గృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగల్ల సాయి కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యా ప్రవేశానికి ప్రతి ఏటా 3వ విడత కౌన్సెలింగ్ నిర్వహించే ఉన్నత విద్యామండలి ఈ ఏడాది రెండు విడతలతోనే సరిపెట్టుకునేందుకు ప్రయత్ని స్తుం దన్నారు. విద్యార్థులందరికీ తృతీయ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని కోరారు. తృతీయ కౌన్సెలింగ్ నిర్వహించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేసిన తర్వాత ఒకటవ, రెండవ కౌన్సెలింగ్‌లో సీటు రాని వాళ్లకే తృతీయ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని జీవో ఉన్నత విద్యాశాఖ మండలి ఛైర్మన్ విడుదల చేయడం జరిగిందన్నారు. మూడో విడత ఉంటుందని చాలా మంది విద్యార్థులు రెండో విడతలో సీట్లు వచ్చినా చేరలేదని, మరికొందరు కోర్సులు, కళాశాలలు మార్చుకోవచ్చని ఎదురుచూస్తున్నారని అన్నారు. ఒకటవ, రెండవ విడత కౌన్సిలింగ్ లో సీట్లు పొందిన విద్యార్థులు చాలామంది అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఒక్కసారి ఆలోచించాలని విద్యాశాఖ మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఈ అయ్యప్ప, సహాయ కార్యదర్శి బేజారు సుధీర్ నాయకులు కే సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ళలో మిల్లర్లు పూర్తి సహకారం అందించాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు పూర్తి సహకారం అందించి కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్ కుమార్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్ళపై జిల్లాలోని రైస్ మిల్లర్లు, మార్కెటింగ్, సివిల్ సప్లైస్ అధికారులతో స్థానిక జేసీ క్యాంప్ కార్యాలయంలో జేసీ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 1 లక్ష 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ నెల 15వ తేదీ నుండి 169 క్లస్టర్ రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియ చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంఎస్పీ ధరలకు ఎలాంటి లోటు లేకుండా జిల్లాలో 23 రైస్ మిల్లులను కస్టమ్ మిల్లింగ్ రైస్ (సియంఆర్)గా ధాన్యం సరఫరాకు గుర్తించడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోళ్ళలో మిల్లర్ల పాత్రపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలు ప్రకటించిందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న యువజన శ్రామిక రైతు ప్రభుత్వమని, ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా రైతులకు పూర్తి సహకారాలు అందించి తమ భాధ్యతను నిర్వర్తించాలన్నారు. రైస్ మిల్లర్ల వద్ద సమస్యలు తలెత్తకుండా ప్రతి రైస్ మిల్లుకు ప్రభుత్వం తరుపున కస్టోడియన్ అధికారులను నియమించినట్లు తెలిపారు. తేమ విషయంలో రైతులను ఎలాంటి ఇబ్బందులు గురి చేయరాదని, జిల్లా యంత్రాంగం మిల్లర్లకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా గోనె సంచులను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్లు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఇంటిగ్రేటెడ్ చేయడం ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ డీఎం వెంకటేశ్వర్లు, డీఎస్ఓ మోహన్‌బాబు పాల్గొన్నారు.

'డయల్ యువర్ సీపీకి 11 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం జరిగే డయల్ యువర్ పోలీస్ కమీషనర్ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. ఇందు కోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమీషనర్ కు తెలియజేశారు. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, ఆస్తి కుటుంబ కలహాలు, ఆర్థికనేరాలు, స్థల తగాదాలు, మొత్తం 11 కాల్స్ చేయగా సీపీ సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ.లతో, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు.

రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాజకీయంగా ఎదుర్కొనే లేక ప్రతిపక్ష నేతల పై అక్రమ కేసులు పెడుతున్నారని టీడీపీ నేత ఎం.ఎస్. బేగ్ అన్నారు. శుక్రవారం విజయవాడ 35వ డివిజన్ హోర్ట్ పేటలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి షూరిటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి దిశలో ఉండాలంటే టీడీపీ జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు నిర్వహించిన అసెంబ్లీ, సచివాలయంలో వైసీపీ నాయకులు పాలన చేస్తూ చంద్రబాబు పై అక్రమ కేసు పెట్టారన్నారు. కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినా అరెస్టు ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఓటర్ జాబితాలో అవకతవకలు ఉంటే కొంత మంది అధికారుల తప్పుడు పనులకు పాల్పడ్డారని అన్నారు. రాష్ట్రం మొత్తం సైకిల్ రావాలి సైకో పోవాలని నినాదంతో ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ షేక్.హబీబ్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు సిద్దబోయిన సరిత, సయ్యద్ ఫయాజ్ హుస్సేన్, బూత్ లెవల్ శాఖ కమిటీ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

రిలయన్స్ రిద్ధి కార్పొరేట్ సర్వీస్ లిమిటెడ్ హమాలీలకు కూలీల అగ్రిమెంట్ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ : రిలయన్స్ రిద్ధి కార్పొరేట్ సర్వీస్ సంస్థలో లోడింగ్ అన్ లోడింగ్ పనులు నిర్వహించు ముఠా కార్మికులకు తక్షణం కూలీల అగ్రిమెంట్ చేయాలని శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రిలయన్స్ కంపెనీకి అనుసంధానంగా రిద్ధి కార్పొరేట్ సర్వీస్ లిమిటెడ్ వారు నీడ్జాపల్లి గోడౌన్స్‌ను అద్దెకు తీసుకొని అన్ని రకాల సరుకుల వ్యాపారం చేసిన సందర్భంలో రెండేళ్ల క్రితం ఆ గోడౌన్ నందు పనిచేయు ముఠా కార్మికుల ఇచ్చు కూలీ రేట్ల గురించి అగ్రిమెంట్ జరిగిందన్నారు. అప్పటినుండి రెండు సంవత్సరాలు అమలు జరిగిందని గత నెల 1వతేదితో కాలపరిమితి ముగిసిందన్నారు. అక్టోబరు ఒకటవ తేది నుండి కొత్త కూలీ ఇవాల్సి ఉందన్నారు. తాము అనేక సార్లు అడిగినా కంపెనీ వారు తమ సమస్య పరిష్కారం చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా కూలీల ఇబ్బందులను కంపెనీ దృష్టికి తీసుకువస్తున్నట్లు చెప్పారు. నేడు అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఇంటి అద్దెలు,కరెంటు బిల్లులు,ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్త పన్ను,వైద్య ఖర్చులు ,పిల్లల చదువుల ఖర్చులు, కూరగాయలు, పాలు, ఉప్పులు పప్పులు, డీజిలు, పెట్రోలు బస్సు చార్జీలు అన్ని పెరిగాయ న్నారు. తమరు పెద్ద మనసుతో ధరలకు అను గుణంగా హమాలీ కూలీలను పెంచాలని కోరారు. హమాలీలకు పేమెంటు బిల్లు 2వ తేది లోపు ఇవ్వాలని, బ్యాంకు అలస్యం అంటూ తాత్సారం చేయరాదన్నారు. బిల్లుల టైం ప్రకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎగుమతికి,దిగుమతికి ఒకే విధంగా కూలీ ఇవ్వాలన్నారు. పనిలో ఉన్న హమాలీలకు లోపలికి అనుమతిచ్చి పనికి ఇవ్వాలన్నారు. పని లేనప్పుడు అవసరంగా కూలీలను ఇక్కడే ఉండాలని చెప్పడం మానుకోవాలన్నారు. కూలీ డబ్బు నుండి పన్ను వసూలు చేయకూడదని విజ్ఞప్తి చేశారు. కూలీ రేట్లు పెంచి, టన్నుకి పెంచాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి బసవయ్య, పది మంది మేస్త్రీలు పాల్గొన్నారు.

ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో రైల్వే అధికారులకు పతకాలు

పతకాలతో రైల్వే అధికారులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో రైల్వే అధికారులు పతకాలు సాధించారు. శుక్రవారం నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ ఓపెన్ టోర్నమెంట్‌లో అమరావతిలోని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అడిషనల్ రిజిస్ట్రార్ కె.రాజేంద్ర ప్రసాద్,విజయవాడ డివిజన్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ టెక్నీషియన్ కె. సంతోష్ కుమార్ రన్నరప్ పతకాలు సాధించారు. రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వరులు 45 సంవత్సరాల వయస్సు విభాగంలో డబుల్ రన్నర్స్ అప్ పతకాలను కైవసం చేసుకున్నారు.45, 55, 65 సంవత్సరాల వయస్సు గల వారు విజయవాడలో జరిగిన ఆలిండియా సీనియర్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఓపెన్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు.

ఘన ద్రవ వ్యర్థాల ప్రాజెక్టు అమలుకు చర్యలు

ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్

విశాలాంధ్ర, ఇబ్రహీం పట్నం: ఘన ద్రవ వ్యర్థాల ప్రాజెక్టును దశలవారీగా జిల్లా వ్యాప్తంగా అమలు చేయుటకు ప్రణాళికలు తయారు చేయనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. ఘన ద్రవ వ్యర్థాల ద్వారా మరుగు నీటితో సాగుచేసిన ఆకుకూర తీగజాతి కూరగాయలు పశుగ్రాస తోటలను ఇప్పటికే మండలంలోని జూపూడి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ప్రాజెక్టును రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ సంబంధిత శాఖ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఖర్చుతో కూడుకున్న ఈ ప్రాజెక్టులో వ్యయాన్ని తగ్గించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను సమీక్షించి నట్లుగా తెలిపారు. గ్రామాల్లో గృహల నుండి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి వినియోగించి ఈ తరహా ప్రాజెక్టుకు లాభ ప్రేక్షంగా ఉంటాయని తెలిపారు. తద్వారా పంచాయితీల ఆదాయాన్ని పెంచుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ రామకృష్ణ నాయక్, ఈఓ పి ఆర్డి మనోజ్, జూపూడి గ్రామ సర్పంచ్ కాకి దేవ మాత, కార్యదర్శి అనిల్, మునీశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా రామారావు

విశాలాంధ్ర-విజయవాడ: టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా విజయవాడ తూర్పు నియోజక వర్గానికి చెందిన కోగంటి రామారావు, ఉపాధ్యక్షులుగా నంది గామ నియోజకవర్గం వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన చీదిరాల భరత్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురామ్ శుక్రవారం నియామక పత్రాలు అందించి వీరికి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటి కప్పుడు ప్రజా పోరాటాల ద్వారా ప్రజలకు సమర్థవంతంగా తెలియజేసే విధంగా కృషి చేయాలని సూచించారు. 2024లో చంద్రబాబు నాయుడుని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయటానికి మనందరం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

వినియోగదారులను అలరిస్తున్న లేపాక్షి క్రాఫ్ట్ బజార్

విశాలాంధ్ర-విజయవాడ(కృష్ణలంక) : భారతీయ సాంస్కృతి సొంపు" దాయలకు ప్రతి రూపమైన ప్రాచీన హస్త కళలు ఒకే వేదికపైకి తెచ్చి సరికొత్తగా వచ్చి ఏర్పాటు చేసిన లేపాక్షి క్రాఫ్ట్ బజారు ఎగ్జిబిషన్ సందర్శకులను ఎంతగానో అలరిస్తోంది. ఏపీ హస్త కళల అభివృద్ధి సంస్థ, కేంద్ర జౌళి శాఖ డెవలప్‌మెంట్ కమీషనర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణంలో దాదాపు 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన లేపాక్షి క్రాఫ్ట్ బజార్‌లో హస్త కళా రూపాలను ప్రదర్శిస్తున్నారు. దేశ వ్యాప్తంగా 6 రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు కళానైపుణ్యంతో తయారు చేసిన లేపాక్షి ఆకృతులను కొనుగోలు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రదర్శనలో కొండపల్లి, ఏటి కొప్పాక నిర్మల్ బొమ్మలు, ఏపీ ఉడ్ కార్వింగ్స్, బంజారా క్రోషెట్ లేస్, హైదరాబాద్ పెరల్స్, ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, మెటల్ కాస్టింగ్స్, పోచంపల్లి వెంకటగిరి గద్వాల్ సిద్దిపేట్ నారాయణపేట్ చీరలు, కలంకారి బాటిక్ ప్రింటింగ్ బెంగాల్ కాటన్, కాశ్మీర్ సిల్క్ కోసా సిల్క్ మధురై, లక్నో చికన్ వర్క్ నారాయణపుర గ్వాగా బోలి కాటన్ ప్రింటెడ్ సంబల్ పూర్, ఖాదీ వస్త్రాలు, బెడ్‌షీట్లు వంటి హస్త కళా రూపాలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి.

ఈ నెల 9వ తేదీ వరకు ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సెలవు రోజుల్లో కూడా కొనసాగుతుందని హస్త కళల అభివృద్ధి సంస్థ ఏడీ విశ్వ తెలిపారు. హస్తకళలను ఆదరించి కళాకారులను జీవనోపాధిని కల్పించాలని కోరారు.

నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కృషి చేయుటతో పాటు బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సత్వర చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్థానిక వీఎంసీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం కమిషనర్ పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని రోడ్లను పరిశీలించి రోడ్డు ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని గతంలో ఆదేశించడం జరిగిందన్నారు. దీంతో అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం గుర్తించిన బ్లాక్ స్పాట్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల వద్ద సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రోడ్ల వెంట ఆక్రమణలను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రతి రోడ్డును తిరిగి తనిఖీ చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోకముందు, తీసుకున్న తర్వాత ఫోటోలతో ఒక నివేదికను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బస్ స్టాప్‌ల వద్ద ఆక్రమణలు, రోడ్డు ప్రమాదాలకు దారి తీసే హోర్డింగ్స్‌ను గుర్తించి తొలగించాలన్నారు. వీఎంసీ పరిధిలోని ప్రతి ఒక్క రోడ్డు, ఐఆర్‌సీ గైడ్‌లైన్స్ ప్రకారం ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీవీఎన్‌డీ.మూర్తి, ఏపీఎస్ ఆర్టీసీ ఏటీఎం శ్యాంప్రసాద్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే డీఈఈలు శశిధరప్రసాద్, శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, నగర పాలక సంస్థ ఎస్ఈ కేవీ సత్యవతి, సీతా ప్రభాకర్‌రావు, సిటీప్లానర్ ప్రసాద్, ఈఈలు నారాయణమూర్తి, శ్రీనివాస, చంద్రశేఖర్, ఏస్టేట్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రం ' నరకాసుర

- ప్రేక్షకుల నుండి అపూర్వ ఆదరణ

విశాలాంధ్ర - విజయవాడ అజిత్‌సింగ్‌నగర్: మంచి సందేశంతో కూడిన చిత్రం నరకాసుర అని ప్రతి ఒక్కరూ చూడదగిన చిత్రమని, హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. శుక్రవారం విడుదలైన నరకాసుర చిత్రం నగరంలోని స్వర్ణప్యాలెస్ థియేటర్లో హీరో సినిమాను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుందని, "ప్రతి ఒక్కరూ ఆదరిస్తున్నారని అన్నారు. నరకాసుర చిత్రం ఏపీ తమిళనాడు సరిహద్దుల్లో కాఫీ, మిరియాల ఎస్టేట్ నేపథ్యంలో సాగుతుందన్నారు. అనంతరం నగరంలోని ఎల్ఈపిఎల్ మాల్లో పాటు పలు థియేటర్లలో సినిమాను ప్రేక్షకులతో వీక్షించారు. ప్రేక్షకుల వద్ద నుండి మంచి స్పందన రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో అట్లూరి ప్రసాద్, కృష్ణాజి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీకి ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లు ఎంపిక



విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నున్నలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జి ఎఫ్) అండర్ - 14, 17 బాల బాలికల సైక్లింగ్ ఎంపి కలు శుక్రవారం నిర్వహించారు. నున్నలోని పోల వరం కుడి ప్రధాన కాల్వకట్ట 100 అడుగుల రోడ్డుపై నిర్వహించిన ఎంపికల పోటీలను కృష్ణాజిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె సుగుణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు పాఠశా లల నుండి సుమారు 60 మంది సైక్లిస్టులు హాజరయ్యారు. వ్యక్తిగత టైమింగ్‌తోపాటు మాస్ స్టార్ట్‌లో అండర్ - 14, 17 విభాగాలలో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. పోటీల నిర్వహణకు సైక్లింగ్ జాతీయ స్థాయి క్రీడాకారుల నున్న సహకారం అందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎంవి సత్యప్రసాద్, జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థి దాడి పై కేసు నమోదు



విశాలాంధ్ర - కంచికచర్ల: ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందనడానికి కంచికచర్ల కు దళిత యువకుడిపై జరిగిన అన్యాయం నిదర్శనంగా కనబడుతోంది. సాక్షాత్తు దళిత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు ప్రాతినిధ్యం వహిస్తున్న నందిగామ నియోజకవర్గంలో ఓ దళిత యువకుడి ని ఇతర జిల్లాకు చెందిన అగ్రకులాల యువకులు కిడ్నాప్ చేయడమే కాకుండా, విచక్షణారహితంగా దాడిచేసి, దళిత యువకుడిపై మూత్రం పోసి అగ్రకుల దురహంకారం సభ్యసమాజం తలవంచు కునేలా ఉందని పలువురు అంటున్నారు. సంఘటన జరిగిన మూడు రోజులకు బాధితుని తరుపున టిడిపి, బిఎస్పీ, దళిత బహుజన సంఘాల ఆందోళన చేస్తేనే పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ప్రకాశం జిల్లాలో అగ్ర కులాలకు చెందిన వారు కావడంతో, నిందితుల తరుపున అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారని దళిత బహుజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అగ్ర కులాల యువకుల దాడిలో తీవ్రంగా గాయపడి, అవమానానికి గురైన బాధిత దళిత యువకుడు మూడు రోజులుగా అనుపత్రిలో చికిత్స పొందుతున్నా దళిత ప్రజా ప్రతినిధులైన స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు బాధిత కుటుంబాన్ని పరామర్శించక పోగా, కనీసం ఈ సంఘటనను ఖండించక పోవటం దారుణమని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన పూర్వాపరాల ప్రకారం కంచికచర్ల గ్రామానికి చెందిన కాంద్రు శ్యామ్ కుమార్ నందిగామ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. గత ఏడాది శ్యామ్ కుమార్ స్నేహితుడు స్థానిక కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఓ యువకుడికి మధ్య గొడవ జరిగింది అప్పుడు శ్యామ్ కుమార్ స్నేహితులు దాడి కి ప్రణాళిక చేసినట్లు తెలుస్తోంది. బుధవారం ఉదయం కళాశాలలో సర్టిఫికెట్ తీసుకునేందుకు వచ్చారు. బాధితుడిని కిడ్నాప్ చేసిన వారిలో నియోజకవర్గ సంతనూతలపాడు నియోజకవర్గ గణపవరం గ్రామానికి చెందిన ప్రముఖ వైసీపీ నాయకుడు కుమారుడు హరీష్ రెడ్డి ఉన్నందున అతడు విదేశాలకు వెళ్లేందుకు అన్ని సిద్ధం చేసుకొని ఉన్నందున కేసు లేకుండా చేసేందుకు నాయకులు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారని కేసు నీరు కార్చేందుకు మాజీ ప్రతిపక్ష పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. దళిత నాయకులు పోలీసు వారిపై ఒత్తిడి చేయడంతో డి.ఎస్.పి మేకా సత్తిబాబు కేసు నమోదు చేసారని ఆ నవ్వారు. విజయవాడ ఆంధ్ర హాస్పటల్ లో బాధితుని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శించారు.

నిందితులకు శిక్ష పడేలా చేయాలి



విశాలాంధ్ర - కంచికచర్ల: బాధితుడి కి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ కంచికచర్ల గ్రామానికి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యాముని గుంటూరు జిల్లాకు చెందిన కొంతమంది యువకులు కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన విషయం విధితమే. ఆ నేపథ్యంలో సదరు బాధి తుడు విజయవాడలోని ఆంధ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ శుక్రవారం రాత్రి పరామర్శించి జరిగిన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత యువకుడి పై జరిగిన దాడిని పూర్తిగా ఖండిస్తున్నామని జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో పోలీసు దర్యాప్తు జరుగుతుందని నిందితులను అరెస్టు చేసి, వారికి కఠిన శిక్ష పడేవిధంగా ప్రభుత్వం తరుపున చర్యలు తీసుకుంటున్నాము. బాధిత యువకుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, విజయవాడ

E.A.No.3/23, E.P.No.150/23, O.S.No.1211/16

Between:

Uppuluri Narasimha Yogi and others - DHRs/Petitioners

And

Kommalapati Pandurangamma - JDR/Respondent

To,
Kommalapati Pandurangamma,
W/o. Venkatramaiah, D.No. 49-4-12/5,
Near Vijaya Mary Blind School, Karmil Nagar, Gunadala, Vijayawada-4.

పై నంబరు EA/EP పిటీషనులో మీకు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక పోవడం వలన ప్రత్యక్షంగా పంపుటకు వీలు లేనందున పేపర్ ప్రకటన ద్వారా నోటీసులు పంపుటకు కోర్టువారు అనుమతించినారు. కనుక మీరు 14-11-23 ఉదయం 10.30 గంటలకు శ్రీకోర్టువారి ఎదుట హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షములో పై పిటీషను తీర్మానించి శ్రీకోర్టువారు తగు ఉత్తర్వులు జారీ చేయగలరు.

వాయిదా : 14-11-23 ఉదయం గం.10.30ని.లకు

(శ్రీకోర్టువారి ఆదేశం ప్రకారము)

విజయవాడ 3-11-2023 | జి. రామచంద్రరావు, న్యాయవాది, విజయవాడ. సెల్ : 9493061519

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, విజయవాడ

E.P.No.150/23, O.S.No.1211/16

Between:

Uppuluri Narasimha Yogi and others - DHRs/Petitioners

And

Kommalapati Pandurangamma - JDR/Respondent

To,
Kommalapati Pandurangamma,
W/o. Venkatramaiah, D.No. 49-4-12/5,
Near Vijaya Mary Blind School, Karmil Nagar, Gunadala, Vijayawada-4.

పై నంబరు EA/EP పిటీషనులో మీకు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక పోవడం వలన ప్రత్యక్షంగా పంపుటకు వీలు లేనందున పేపర్ ప్రకటన ద్వారా నోటీసులు పంపుటకు కోర్టువారు అనుమతించినారు. కనుక మీరు 14-11-23 ఉదయం 10.30 గంటలకు శ్రీకోర్టువారి ఎదుట హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షములో పై పిటీషను తీర్మానించి శ్రీకోర్టువారు తగు ఉత్తర్వులు జారీ చేయగలరు.

వాయిదా : 14-11-23 ఉదయం గం.10.30ని.లకు

(శ్రీకోర్టువారి ఆదేశం ప్రకారము)

విజయవాడ 3-11-2023 | జి. రామచంద్రరావు, న్యాయవాది, విజయవాడ. సెల్ : 9493061519